# కరెక్షన్



సత్యానికి తెల్లవారి ఐదుగంటలకే లేచి వెళ్లి, మిల్క్‌బూత్ నుంచి పాలు తేవడం అలవాటు. తను స్పేర్‌గా కొనుక్కున్న ఖాళీ సీసాలు బూత్‌లో ఇచ్చేసి, నిండు సీసాలు తెచ్చుకుంటాడు.

ఎప్పటిలాగానే- ఆరోజు కూడా రెండు నిండు సీసాలు తెచ్చాడు.

అతను రాగానే భార్య- ముందు ఒక సీసాలోని పాలను గిన్నెలో పోసి కాచి, కాఫీ కలిపి ఇచ్చింది.

ఆ తర్వాత రెండో సీసాలోని పాలు గిన్నెలో పోస్తుంటే, అందులోంచి ఏదో బొళుక్కుమని గిన్నెలో పడింది. 'ఏమిటా...' అని దాన్ని పైకి తీసి చూసి, కెవ్వుమని అరిచింది సత్యం భార్య. వెంటనే దానిని కింద పడేసింది.

ఆ కేకకి నోట్లోని వేడికాఫీని గుటుక్కున మింగి, 'ఏమిటా...' అని సత్యం చూస్తే, ఒక చిన్న చచ్చిన 'ఎలుక పిల్ల!'

దానిని చూడగానే- ఆపుకుందామన్నా ఆగకుండా, వాంతి వచ్చినంత పనయింది సత్యానికి.

వెంటనే ఆ పాలని సీసాలో మళ్లీ పోసి- దానినీ, ఎలుకనీ తీసుకువెళ్లి బూత్ వాళ్ళ మీద విరుచుకు పడ్డాడు సత్యం. వాళ్ళు- అందులో తమ తప్పేమీ లేదనీ, కార్పొరేషన్‌కి రిపోర్టు చేయమనీ సలహా ఇచ్చారు.

కార్పోరేషన్‌కి కంప్లైయింట్ ఇస్తూ నలుగురికి తెలియాలని దినపత్రికకి కూడా లేఖ రాశాడు సత్యం.

అతని లేఖ మూడోనాటికి పేపర్లోవచ్చింది.

మరో రెండు రోజులకి కార్పరేషన్ వారు- సత్యం ఉత్తరానికి పత్రికాముఖంగా సమాధానం ఇస్తూ, తమ ఆగ్రహం వ్యక్తం చేశారు అందులో.

"శ్రీ సత్యంగారు మాకు రాసిన కంప్లెయింట్‌లో పాలసీసాలో ఒక ఎలుక పిల్ల వచ్చినట్లు రాశారు కాని, పత్రికముఖాన 'ఎలుకలు' అని రాశారు. వచ్చినది ఒకే ఒక ఎలుక అయినప్పుడు- బహువచనం వాడడం మా కార్పోరేషన్ ప్రతిష్టని దెబ్బతీస్తుంది. వారి కంప్లెయింట్ ప్రకారం- ఎలుక పిల్ల వచ్చి ఉండగా పత్రికలలో 'ఎలుకలు' అని రాయడంలో వారి అంతర్యం మాకు బోధపడడం లేదు. మా సీసాల్లో పెద్ద ఎలుకలు దూరటం అసాధ్యం. ఈ సవరణలను గమనించి శ్రీ సత్యంగారి వంటివారు ఇంక ముందైనా సత్య దూరమైన ఆరోపణలు చేయరని భావిస్తున్నాము" అని ఉంది.

కార్పొరేషన్ వారు ఇచ్చిన సవరణకి- కళ్లు చెమర్చేటట్లు నవ్వుకున్నారు జనం.

- ఈవారం వార పత్రిక... *2 ఫిబ్రవరి '84*